

రామాలయం నిర్మాణానికి రూ.కోటి

రామాలయం నిర్మాణానికి రూ. కోటి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ 6:32	బుధ 4:59

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/20.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి సమయంలో ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

భక్తులకు ఇబ్బంది లేకుండా బ్రహ్మోత్సవాలు



ధర్మపురిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్వామివారి సన్నిధిలో ఈనెల 20నుంచి జరుగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. స్థానిక నందీ కూడలి నుంచి దేవాలయం వరకు గల రహదారి, పార్కింగ్ స్థలం, తాగునీరు, గోదావరి వద్ద భక్తులకు ఏర్పాటు చేస్తున్న వసతులు పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి ఇబ్బంది రాకుండా చూడాలని ఆలయ అధికారులు, కమిటీ సభ్యులను కోరారు. జాతరలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా నియమితులైన ఆలయ కమిటీ సభ్యులను సన్మానించారు. దేవాలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాల: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడు నెలల పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పడాల మమత అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 17 వేలమంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడు నెలల పీఆర్సీ బకాయిలు, మూడు నెలల వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారిని ఎలాంటి రాత పరీక్షలూ లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఉద్యోగ కల్పనకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: బ్యాంకింగ్‌లో ఉద్యోగ కల్పనకుగాను ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సాయిబాబా తెలిపారు. గ్రాడ్యుయేట్లు 25 ఏళ్లు మించని వారు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 31న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని, బీసీ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మిగతా వివరాలకు 040-29303130 సంప్రదించాలని కోరారు.

28న జగిత్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు



జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. ఎన్నికల అధికారులు నక్కల సంజీవరెడ్డి, క్యాస కృపాల్ కుమార్‌కు అర్హులైన 214 మంది న్యాయవాదుల ఓటర్ జాబితాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి అందించారు. ఈనెల 20, 21 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటుంది. ఈనెల 28న 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఫలితాలు ప్రకటిస్తారు.

దేశ సంస్కృతిని పాటిస్తున్న విదేశీయులు

బుగ్గారం: లోకసమస్తం సుఖినోభవంతు అనే భావన కేవలం హిందూధర్మంలోనే ఉందని హంపీ విరూపాక్షి పీఠాధిపతి విద్యారణ్యభారతీస్వామి అన్నారు. బుగ్గారం శివారులోని అర్సికోట అటవీప్రాంతంలోగల ద్వాదశ ద్వికోటి జ్యోతిర్లింగాలయంలో చేపట్టిన నర్మదా బాణలింగాల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో శివపార్వతుల కల్యాణం, ప్రత్యేక హోమం, యాగాలు నిర్వహించారు. హిందూధర్మంలో దాగిన విశేషాలు, గొప్పదనాన్ని భక్తులకు వివరించారు. విదేశీయులు సైతం భారతీయ సంస్కృతి వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. పాశ్చాత్య పోకడలను వీడాలన్నారు.



సభకు హాజరైన జనం

మరెన్నో ఇస్తాం

- ఎన్‌హెచ్‌-563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేశాం
- రైతులు, మహిళలు, యువతను ఆదుకున్నాం..
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తెరచాటు మిత్రులు
- బీజేపీని గెలిపించండి
- జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ



వేదికపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బొడిగె శోభ, భోగ శ్రావణి తదితరులు

సాక్షి ప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/జగిత్యాలరూరల్: తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో నిజామాబాద్‌-ఖమ్మం వరకు ఎన్‌హెచ్‌-563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, రైలు మార్గాల నిర్మాణం, టర్మరిక్ బోర్డు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి నిధులు.. ఇలా ఎన్నో ఇచ్చాం.. వచ్చే పదేళ్లలో తెలంగాణ ప్రగతిపై ఫోకస్ చేసి, మరెన్నో ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో రోడ్లు, రైలు, గోదాంలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రసంగించారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలని, అబ్ కీ బార్ 400 పార్ అని పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో రైతులను, సంక్షేమ పథకాలతో మహిళలను, రుణాలిచ్చి యువతను ఆదుకున్నామని తెలిపారు. పసుపు మద్దతు ధర, టర్మరిక్ బోర్డు ఏర్పాటు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణకు రూ.6,400 కోట్లు వెచ్చించామన్నారు. కాళేశ్వరం అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల తీరును ఎండగట్టారు. ఆ పార్టీలు తెరచాటు మిత్రులని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ అగ్రనాయకులు లక్ష్మణ్, సత్యనారాయణరావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నిర్మల్ ఎమ్మెల్యే పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రజాకార్ సినిమా చూడండి



వీరులను కన్న గడ్డ జగిత్యాలలో పీఎఫ్‌ఐ లుచ్చాగాళ్ల అడ్డా పెట్టి, పాకిస్తాన్ జిందాబాద్ అంటుంటే వాళ్లకు ఆర్థిక సాయం చేస్తున్న వాళ్లను వదిలేద్దామా? నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు జగిత్యాల సొంతం. రాముని పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్లు గజగజ వణుకుతున్నరు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముని గుడిని కట్టింది బీజేపీయే. మా పార్టీ బరాబర్ శ్రీరాముని పేరుతో ఎన్నికల్లోకి వెళ్తుంది. మీకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లడగండి. తెలంగాణ ప్రజాలారా... ప్రతిఒక్కరూ రజాకార్ సినిమా చూడండి. నిజాం సమాధి వద్ద మోకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి, ఈ సినిమా చూపించండి.

– ఎంపీ బండి సంజయ్



దేశ ప్రజలందరూ ప్రధాని కుటుంబమే

ప్రధాని నరేంద్ర మోదీకి కుటుంబం లేదంటున్న విపక్షాలకు సిగ్గులేదు. దేశ ప్రజలందరూ ఆయన కుటుంబమే. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో తెలంగాణ నుంచి బీజేపీ తరఫున అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి, ప్రధానికి కానుకగా ఇద్దాం. పదేళ్ల యూపీఏ హయాంలో జరగని స్కాం లేదు. బీఆర్‌ఎస్ కాళేశ్వరం నుంచి కరెంటు వరకు అవినీతిమయం చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక చేతులెత్తేసింది.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత



ఐదో ఆర్థిక శక్తిగా మన దేశం

ప్రధాని మోదీ వల్లే మన దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. మయన్మార్, పాకిస్తాన్ లాంటి దేశాలను దారికి తెచ్చిన ఘనత ఆయనదే. మోదీ వల్లే దేశంలో సుస్థిరత, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. ఇటీవల సీఏఏ అమలు చేశారు. త్వరలో ఎన్‌ఆర్‌సీ, యూసీసీ కోడ్‌ను కూడా అమలు చేస్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి.

– ఎంపీ ధర్మపురి అర్వింద్

ఉత్తుత్తి మహిళా సంఘాలు

- బ్యాంక్ రుణం కోసం కొత్త ఎత్తుగడ
- విచారణ చేస్తున్న అధికారులు
- ఆర్పీలు, సీవోలే కీలకం



జగిత్యాల: అవి ఉత్తుత్తి మహిళాసంఘాలు. వాటి పేరిట రుణాలు ఎత్తుకుని కొందరు ఆర్పీలు, సీవోలు లాభం పొందుతున్నారు. ఈ ఫేక్ గ్రూపుల ఏర్పాటులో ఎక్కువగా ఆర్పీలు, మహిళాసంఘాల అధ్యక్షులు, సీవోలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా మెట్‌పల్లిలోని ఓ బ్యాంక్ అధికారులకు 16 సంఘాలపై అనుమానాలు రావడంతో కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు ఇవ్వాలని కోరారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ రిసోర్స్ పర్సన్ కీలకంగా వ్యవహరించి ఓ నకిలీ గ్రూపు క్రియేట్ చేసి ఓ సీవో సంతకం ఫోర్జరీ చేసి రూ.18లక్షల రుణం ఎత్తుకునేందుకు ప్రయత్నించింది. అయితే అధికారులకు అనుమానం రావడంతో విచారణ చేపట్టగా.. ఇందులో సీవో, ఆర్పీ పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో వారిద్దరిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నీ అక్రమాలే

మహిళలు సాధికారత సాధించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో మహిళాసంఘాలకు లింకేజీ రుణాలు అందిస్తుంటారు. ఇంతవరకు బాగానే అందులోని లొసుగులు తెలుసుకున్న సీవోలు, ఆర్పీలు నకిలీ మహిళాసంఘం గ్రూపులను ఏర్పాటు చేసివారి పేరిట రుణాలు తీసుకుంటున్న ఘటనలు జిల్లాలో రోజురోజుకూ వెలుగుచూస్తున్నాయి. తాజాగా మెట్‌పల్లికి చెందిన బ్యాంక్ అధికారులు ఫేక్ గ్రూపులు క్రియేట్ చేసి రుణాలు పొందినట్లు అనుమానాలు రావడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌లో అధికంగా జరుగుతున్నాయి.

నిర్లక్ష్యం ఎవరిది..?

నిబంధనల ప్రకారం మహిళాసంఘాల సభ్యులు ముందుగా ఆర్పీల సమావేశం ఏర్పాటు చేసుకుని ఒక ఫైల్ క్రియేట్ చేసిన తర్వాత వాటిని కమ్యూనిటీ ఆర్గనైజర్ల (సీవో)కు పంపించాలి. వారు పరిశీలించి సంతకం చేయాలి. అనంతరం టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ పరిశీలించి రుణానికి సంబంధించిన ఫైల్ బ్యాంక్‌కు పంపిస్తారు. అయితే ఇక్కడే నిర్లక్ష్యం జరుగుతోంది. బ్యాంక్ అధికారులు మెప్మాకు చెందిన మైక్రో క్రెడిట్ ప్లాన్ వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే నిజమైన గ్రూపా కాదా అని తెలిసిపోతుంది. ఇలాంటివి చూడకుండానే మహిళాసంఘాలకు ఎలా రుణం మంజూరు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడ అధికారులే మహిళలు బురిడీ కొట్టిస్తున్నారా..? లేదా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యమా..? తెలియదుగానీ నకిలీ మహిళాసంఘాలు కొకొల్లలుగా ఏర్పడ్డాయి.

లోతుగా విచారిస్తే ఇంకా ఎన్నో..

ఇప్పుడిప్పుడే బ్యాంక్ అధికారులు మహిళాసంఘాలపై దృష్టి సారిస్తున్నారు. లోతుగా విచారిస్తే జిల్లాలో మరిన్ని మహిళా సంఘాలు ఉన్నట్లు తెలుస్తుంది. కొందరికి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉంటే ఇలాంటి మహిళలను గుర్తించి వారికి రుణాలు ఇప్పిస్తామంటూ కొత్తవి క్రియేట్ చేస్తున్నారు. అందినకాడికి కమీషన్లు తీసుకుంటూ బ్యాంక్‌లో రుణాలు ఎత్తుకుని వారికి ఇస్తున్నారు. రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించకపోవడంతో ఫేక్ గ్రూపులుగా బయటపడుతున్నాయి.

నిజమైన సంఘాలకు ఇబ్బందులు

ఫేక్ గ్రూపులు క్రియేట్ చేసి రుణాలు ఎత్తుకోవడంతో నిజమైన మహిళాసంఘాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసరంగా రుణం కావాల్సి వచ్చినప్పుడు వీరు లోన్ కోసం అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరిగినా రుణాలు దొరకని పరిస్థితి ఉన్నప్పటికీ ఫేక్ గ్రూపులకు ఎలా ఇస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

విచారణ చేపడుతున్నాం

ఫేక్ గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు పొందిన సంఘాలున్నాయి. జిల్లాలో పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నాం. ఇటీవల మెట్‌పల్లిలో ఫేక్ గ్రూపులున్నట్లు బ్యాంక్ అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణ చేస్తున్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, మెప్మా ఏవో

కవులు, కళాకారుల నిలయం కోరుట్ల

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ తేజ, తదితరులు

కోరుట్ల: కవులు, కళాకారులకు కోరుట్ల ప్రాంతం నిలయమని సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు. పట్టణంలోని సినారే కళాభవన్‌లో మూడురోజుల పాటు నిర్వహించిన భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతంలో అందె వెంకటరాజం, శ్రీగాదె శంకరకవి, మురళీమనోహరాచార్య వంటి కవి పండితులతోపాటు ఎందరో కళాకారులు తమ ప్రతిభను చాటారని గుర్తు చేసుకున్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం పాత్ర చాలా కీలకమైందన్నారు. గురువులను గౌరవించే సంస్కృతి పిలలకు చిన్ననాటి నుంచే అలవాటు చేయాలన్నారు. తాను సాధించిన విజయాల్లో ఈ ప్రాంత గురువుల, మిత్రుల పాత్ర ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, సాహిత్యం పాత్ర మరువలేనిదన్నారు. భారతీ సాహిత్య సమితి 50 ఏళ్లు నిండిన సందర్భంగా అశోక్ తేజకు సర్గీయ వరదాచార్యుల స్మారక పురస్కారం అందించారు. సాహిత్య సమితి వ్యవస్థాపకులు అందె వెంకటరాజం రచించిన నింబగిరి నరసింహ శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు కమల, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నిర్వాహకులు అందె రాజేంద్ర, రాజోజు భూమేశ్వర్, బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, అందె శివ ప్రసాద్, కల్వకోట చంద్ర ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై ఇంటింటి సర్వే

- ఈనెల 24 వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు



కుష్ఠుపై ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

గొల్లపల్లి: కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా జిల్లాలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 11నుంచి అధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. సర్వే ఈనెల 24 వరకు కొనసాగనుంది. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సర్వేకు ఏర్పాట్లు చేశారు. వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించే లక్ష్యంతో ఈ ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 జిల్లాలో అవగాహన నిర్వహించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు 14రోజులు సర్వే చేశారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో వైద్య సిబ్బంది పర్యటిస్తూ.. ఇంటింటికీ వెళ్తూ వ్యాధిగ్రస్తులపై ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు 1229 మందిని గుర్తించారు. శరీరంపై మొద్దుబారిన మచ్చలు ఉన్నాయా..? కాళ్లు, చేతులు తిమ్మిర్లున్నాయా..? వంటివి తెలుసుకుంటున్నారు. అలాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అది కుష్ఠువ్యాధినా..? లేక మరేదైనానా..? అని పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాలను గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ అతించారు. కుష్ఠువ్యాధి భయంకరమైన జబ్బుగా పరిగణించకుండా ప్రభుత్వ ఉద్దేశం అర్థం చేసుకుని, వైద్య సిబ్బంది వచ్చినప్పుడు నిర్భయంగా వివరాలు చెప్పాలని, చికిత్స అందిస్తే వ్యాధి నుంచి పూర్తి కోలుకునే అవకాశం ఉందని జిల్లా వైద్యశాఖ ఆరోగ్య అధికారి శ్రీధర్ తెలిపారు.

తెలిసినా బయటకు చెప్పుకోలేకనే..

జిల్లాలో కుష్ఠువ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. గతంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కుష్ఠువ్యాధి నిర్మూలన సంస్థలు ఇంటింటి సర్వేలో బాధితులను గుర్తించి.. వ్యాధి నివారణ కోసం అవసరమైన మందులు ఇచ్చారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలు..

- వ్యాధి లెప్రె అనే బ్యాక్టీరియా వలన వచ్చే అతి సామాన్య వ్యాధి.
- ముఖ్యంగా చర్మం, నరాలకు సోకుతుంది.
- చాలా నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి (ఇంక్యూబేషన్ కాలం) సగటున మూడేళ్లు పడుతుంది.
- వ్యాధి ఎవరికైనా రావచ్చు. వయస్సు, లింగ బేధం లేదు.
- వంశపారంపర్యం కాదు
- వ్యాధి ఎండీటీ(బహుళ ఔషధ చికిత్స)తో ఆరు నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం అవుతుంది.
- ప్రారంభ దశలో గుర్తించి ఎండీటీ చికిత్స అందిస్తే అంగవైకల్యానికి దారి తీయదు.
- చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగులలో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు.
- మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు.
- కాళ్లు, చేతులు, నరాల వాపు నొప్పి, ముఖంపై చెవి, బయట నూనె పూసినట్లు ఉంటుంది.

నిర్మూలనకు కృషి చేస్తున్నం

కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం పేరిట ఈనెల 11 నుంచి 24 వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. వ్యాధి లక్షణాలను గుర్తించిన వారికి వెంటనే చికిత్స అందిస్తున్నాం. వ్యాధి ఎవరికైనా రావచ్చు. వంశపారపర్యంగా మాత్రం రాదు. అన్ని పీహెచ్‌సీలలో మందులు అందుబాటులో ఉన్నాయి.

– శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి

వరదకాలువలోని నీటి విడుదల



మల్యాల: నూకపల్లి వద్ద వరదకాలువ గేట్లు ఎత్తి విడుదల చేస్తున్న నీరు

మల్యాల: పొట్టదశలో ఉన్న వరికి నీరందడం లేదని, ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు నూకపల్లి శివారు వరద కాలువపై ఉన్న గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ నీటితో నూకపల్లి, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల రైతుల పొలాలకు నీరందనుంది.

విప్ ఆది శ్రీనివాస్ సూచనలతో..

కథలాపూర్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచన మేరకు నీటి పారుదల శాఖ అధికారులు వరద కాలువలో నిల్వ ఉన్న నీటిని విడుదల చేశారు.

వేటగాళ్ల చేతిలో నెమలి హతం



చనిపోయిన నెమలి



స్వాధీనం చేసుకున్న తుపాకీ

- నిందితుల పట్టివేత
- 22 ఇంచ్ రైఫిల్ స్వాధీనం

పెగడపల్లి: మండలంలోని దోమలకుంట గ్రామంలో సోమవారం రాత్రి ఇద్దరు అడవి జంతువుల వేటగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. దోమలకుంటలో తుపాకీతో వేటాడి నెమలిని చంపి కారులో తీసుకెళ్తున్నట్లు సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ, మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజీ నారాయణ తుపాకీతో నెమలిని చంపి కారులో తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి నెమలితోపాటు పాయింట్ 22 ఇంచ్ రైఫిల్, గొడ్డలి, కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.



సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



సెంటర్‌కు చేరుకున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తొలిరోజు 99.89శాతం హాజరు

జగిత్యాల:పదో తరగతి పరీక్షలు జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11,394 మంది విద్యార్థులకు 11,376 మంది హాజరై 99.84 శాతంగా నమోదు చేశారు. సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించి మూడు కేంద్రాల్లో 37 మందికి 34 మంది హాజరయ్యారు. కలెక్టర్ యాస్మిన్ బాషా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. రాష్ట్ర పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు తనిఖీలు చేశారని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

డీజే వాహనం సీజ్

జమ్మికుంట: అధిక శబ్దంతో అసౌకర్యం కలిగించిన డీజే వాహనాన్ని సీజ్ చేశామని టౌన్ సీఐ వరగంటి రవి సోమవారం తెలిపారు. మండలంలోని పాపక్కపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం దుగ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి సాయికుమార్ అనే వ్యక్తి డీజే సౌండ్‌తో అసౌకర్యం కలిగిస్తున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డీజే వాహనాన్ని సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేశామని సీఐ రవి వివరించారు.

'రైతు నేస్తం'లో నేడు

కరీంనగర్ అర్బన్: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెలకువలపై శాస్త్రవేత్తలు వివరిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 11.30 వరకు ఎంపిక చేసిన రైతు వేదికల్లో రైతులు నేరుగా వీక్షించవచ్చని వివరించారు. కరీంనగర్ జిల్లాలో తిమ్మాపూర్, కొత్తపల్లి, గంగాధర, హుజూరాబాద్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేశామని, సమీప గ్రామాలు, మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్, వేసవిలో సాగు చేసే కూరగాయలు, వాటిపై వాడే పురుగుమందుల అవశేషాల గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారని పేర్కొన్నారు.

సన్మానం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతి పొంది చర్లపల్లి సెంట్రల్ జైలుకు బదిలీ అయిన జి.సమ్మయ్యను సోమవారం జైలు అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె.శ్రీనివాస్, జైలు డాక్టర్ వేణుగోపాల్, జైలర్లు శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, ఎస్.సంగీత, జగిత్యాల, హుజురాబాద్ జైలు అధికారులు మొగిలేష్, గణేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునంధన్‌రావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు

ఓదెల(పెద్దపల్లి): ఇందుర్తి గ్రామంలోని అసిస్టెంట్ లైన్‌మెన్ బత్తుల శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురయ్యారు. బాయమ్మపల్లెలో సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కి కరెంటు తీగలు సరిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. ఈక్రమంలో విద్యుదాఘాతంతో కిందపడ్డారు. కాళ్లు, చేతులు కాలిపోవడంతో వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది తప్పిదంతోనే విద్యుత్ సరఫరా అయి శ్రీనివాస్ కరెంట్ షాక్‌కు గురయ్యారని గ్రామస్తులు ఆరోపించారు.

బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

- ప్రధాని మోదీ పర్యటనతో జోష్
- కదిలివచ్చిన కాషాయదండు
- కార్యకర్తల్లో వెల్లివిరిసిన ఆనందం
- ఐదుగురు ఎస్పీలు, 8 మంది అడిషనల్ ఎస్పీలు


మోదీకి నమస్కరిస్తున్న బీజేపీ మహిళ నాయకులు బొడిగే శోభ, భోగ శ్రావణి

జగిత్యాల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జగిత్యాలకు రావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. జిల్లా కేంద్రంలోని గీత విద్యాలయం మైదానంలో జరిగిన బీజేపీ విజయసంకల్ప సభతో ప్రజలు, కార్యకర్తల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రధాని రాగానే «తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం..» అంటూ తెలుగులో మాట్లాడటంతో ప్రజలంతా మోదీ..మోదీ అంటూ హర్షధ్వానాలు చేశారు. ముందుగా ఆయన ఎంపీ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో సుస్థిర పాలన అందిస్తున్నామని, అయోధ్యలో రామమందిరం, దేశాభివృద్ధిలో మోదీది కీలకపాత్ర అని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 25 కోట్ల ప్రజలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. పేదలకు 5కిలోల బియ్యం, సమ్మక్క సారక్క పేరుతో నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో తెలంగాణ పూర్తిగా దోపిడీకి గురైందని, కేసీఆర్ కూతురు కవిత అక్రమంగా లిక్కర్ వ్యాపారం చేయడంతో తెలంగాణ సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల్లో స్పష్టత లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 సీట్లు గెలుచుకోవాలన్నారు.

పవిత్రమైన గడ్డ జగిత్యాల

జగిత్యాల పవిత్రమైన గడ్డ అని, నమ్మిన సిద్ధాంతం కోసం ఇక్కడి ప్రాంత జితేందర్‌రెడ్డి, రామన్న, గోపన్న అమరులయ్యారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ప్రపంచంలోనే ప్రజాధరణ కలిగిన వ్యక్తి మోదీ అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు.

మోదీ బహిరంగ సభ సైడ్‌లైట్స్

- 11.20 గంటలకు రావాల్సిన మోదీ 10 నిమిషాల ముందుగానే జగిత్యాలకు చేరుకున్నారు.
- ప్రధాని ఉదయం 11.33గంటలకు ప్రసంగం ప్రారంభించారు.
- ప్రజలంతా మోదీ..మోదీ అంటూ చప్పట్లతో స్వాగతం పలికారు. దీంతో మోదీ 10నిమిషాల పాటు ప్రసంగం నిలిపివేశారు.
- సభలో ముందువరుసలో కోరుట్ల మండలం వెంకటాపూర్‌కు చెందిన సహస్ర అనే చిన్నారి శక్తిస్వరూపిని వేషధారణలో రాగా.. మోదీ ఆ చిన్నారిని చూసి శక్తిస్వరూపిని అన్నారు.
- మోదీ తన ప్రసంగాన్ని మధ్యాహ్నం 12.13గంటలకు ముగించారు.
- మధ్యాహ్నం 12.15గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్, బీజేపీ నాయకులు లక్ష్మణ్, సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగ శ్రావణి, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీగా పోలీస్ బందోబస్తు

జగిత్యాలక్రైం: ప్రధాని నరేంద్రమోదీ జగిత్యాల విజయసంకల్ప సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభ వేదిక వద్దకు వెళ్లేవారిని అణువణువునా తనిఖీ చేశారు. హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి ఒకేసారి మూడు హెలికాప్టర్లు జగిత్యాలకు వచ్చి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణలో 11 గంటలకు ల్యాండయ్యాయి. మొదట 11.08 గంటలకు ప్రధాని హెలికాప్టర్ నుంచి బయటకు రాగా నాయకులు ఘనస్వాగతం పలికారు. ప్రధాని సభ వేదిక వద్దకు చేరుకున్న అరగంటకు మరో ఆర్మీ హెలికాప్టర్ కలెక్టరేట్ ఆవరణలోని హెలిప్యాడ్‌లో ల్యాండయింది. మధ్యాహ్నం 12.26 గంటలకు ప్రధాని హెలికాప్టర్ హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. సభవేదికకు దూరంగానే వాహనాలను పార్కింగ్ చేయించారు. ఐదుగురు ఎస్పీలు, 8మంది అడిషనల్ ఎస్పీలు, మొత్తం 8 జిల్లాల నుంచి సుమారు 1600 మంది పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.


కేరింతలు కొడుతున్న ప్రజలు, బీజేపీ కార్యకర్తలు

ట్రాఫిక్ మళ్లింపుతో ప్రయాణికుల ఇబ్బందులు

మోదీ జగిత్యాలకు చేరుకున్న వెంటనే జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో సుమారు గంటన్నరపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత మంది వాహనదారులు పోలీసులు మళ్లించిన రహదారుల్లో వెళ్లిపోయారు.

మోదీ సభలో ఎమ్మార్పీఎస్ జెండా రెపరెపలు


విజయసంకల్పసభకు తరలివస్తున్న జనం


డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తులేని బీజేపీకి ఎమ్మార్పీఎస్ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఎస్సీ వర్గీకరణకు మోదీ హామీ ఇవ్వడంతోపాటు కేంద్ర కేబినేట్ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేయడం, సుప్రీంకోర్టులో అనుకూల వాదనలు వినిపించడం, కేంద్రం నుంచి ఎస్సీ వర్గీకరణకు అనుకూల సంకేతాలు రావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆ పార్టీకి అండగా నిలుస్తున్నారు. విజయ సంకల్పసభకు కూడా ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


విజయ సంకల్ప సభలో ఎమ్మార్పీఎస్ నేతలు

గొంతునులిమి.. చెట్లపొదల్లో పడేసి..

- ప్రాణం తీసిన మొదటి భర్త
- విడాకులైనా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన

మల్యాల(చొప్పదండి): వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. దీంతో యువతిని మరో వ్యక్తికిచ్చి వివాహం జరిపించారు. అయినప్పటికీ ఆమె తన మొదటి భర్తతో సన్నిహితంగానే ఉంటోంది. ఇంతలో ఏమైందో తెలియదుగానీ.. ఆమెను గొంతునులిమి హతమార్చి చెట్లపొదల్లో పడేశాడు. ఈ సంఘటన మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన కరిపే అంజలి.. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేశ్ ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కుటుంబకలహాల కారణంగా రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని సిద్దిపేటకు చెందిన వ్యక్తికిచ్చి మరో పెళ్లి చేశారు. అయినా మొదటి భర్త నరేశ్ అంజలితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతున్నాడు. రెండు రోజుల క్రితం సిద్దిపేట నుంచి జగిత్యాలలోని పుట్టింటికి వచ్చిన అంజలికి ఫోన్ చేసిన నరేశ్.. ఈనెల 17న తన బైక్‌పై తీసుకెళ్లాడు. మ్యాడంపల్లి శివారులోకి చేరగానే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె గొంతునులిమి చంపి చెట్లపొదల్లో పడేశాడు. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీలం రవి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


అంజలి (ఫైల్)

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ధర్మారం(ధర్మపురి): కొత్తూరు గ్రామానికి చెందిన భూతగడ్డల నర్సింగం(35) సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు బావిలో దిగి ప్రమాదవశాత్తు తూరితీగ చేతులకు చుట్టుకోవటంతో మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన సాగల నారాయణ పొలం వద్దగల వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు లోనికి దిగిన నర్సింగం .. బావిలోని తూరితీగ చెతులకు చుట్టుకుని నీట మునిగి ఊపిరాడక మరణించినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.


నర్సింగం (ఫైల్)

బరాత్‌లో నృత్యం చేస్తూ కరీంనగర్ వాసి..

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామంలో వివాహ వేడుకలో నృత్యం చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ్‌కుమార్(30) హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడితో ఓదెలకు చెందిన ఓ యువతితో ఆదివారం వివాహం జరిగింది. ఆ తర్వాత రాత్రి వేళ భరాత్ జరిగింది. ఇందులో నృత్యం చేస్తుండగా విజయ్‌కుమార్ అకస్మాత్తుగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రావుల పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు మార్కొండ శకుంతల రాష్ట్రస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, జాతీయ స్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. 19 నుంచి 23 వరకు పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో జరిగే సీనియర్ జాతీయస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారు. గతంలో వివిధ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 2017, 2018, 2020లో కాంస్య పతకాలు, 2021, 2023లో బంగారు పతకాలు సాధించారు. జిల్లాస్థాయి పోటీల్లో 2017లో రజతం, 2018లో కాంస్యం, 2019, 2021లో రజతం, 2023లో బంగారు పతకం సాధించారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనబోతున్న ఆమెను కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అభినందించారు.


యోగాసన చేస్తున్న శకుంతల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గంగారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మొట్లపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(86), తిరుపతి(44) ఆదివారం ఉదయం పని నిమిత్తం సుల్తానాబాద్ మండలం మియాపూర్‌లో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మయ్య, తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. తిరుపతి చికిత్స పొందుతున్నారని అన్నారు.


లక్ష్మయ్య(ఫైల్)

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని ముంజంపల్లి మీదుగా టాటా ఏస్ ట్రాలీ ఆటోలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో తిమ్మాపూర్ మండలం పొరండ్ల శివారులో అధికారులు తనిఖీ నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారి గౌరీశంకర్, తిమ్మాపూర్ డీటీ సీఎస్ ఎం. వేణుగోపాల్, కరీంనగర్ డీటీసీఎస్ సురేందర్, తిమ్మాపూర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్, కరీంనగర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలేశ్వర్ పాల్గొన్నారు.


పట్టుబడ్డ రేషన్ బియ్యం

'అల్ఫోర్స్' విద్యార్థులకు బంగారు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులకు సైన్స్ కీలకమని, పలు పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఉపకరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్‌జోన్ ఫౌండేషన్‌వారు నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు గడ్డం విహాన్ రెడ్డి 3వ తరగతి, కె.అమ్షన్ రెడ్డి 5వ తరగతి, జి.అశ్రునయా రెడ్డి 5వ తరగతి, సిద్విక్ నార్ల 6వ తరగతి, అమాన్ ఉల్లా బేగ్ మిర్జా 6వ తరగతి, టి.అమిత్‌విక్రమ్ 7వ తరగతి, పి.అన్షూల్ 7వ తరగతి, పి.అభినవ్ సహస్ర 8వ తరగతి, కె.తనీష్ రెడ్డి 8వ తరగతి, బి.ఆద్యారెడ్డి 8వ తరగతి తదితరులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సోమవారం వారికి పుష్పగుచ్ఛాలు అందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురికి కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపారు. సోమవారం 19 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా ఏడుగురుకి మూడు రోజుల జైలు శిక్ష, రూ.16 వేలు జరిమానా, మిగితా 12 మందికి కలుపుకొని రూ.18 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామపరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. డస్ట్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఎలగందుల మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. సైకిల్‌పై ఉన్న వ్యక్తి టిప్పర్ టైర్ల కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మహారాష్ట్రకు చెందిన వాసిగా, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడని స్థానికుల ద్వారా తెలిసింది.


లారీ టైర్ కింద వ్యక్తి మృతదేహం

ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు

కరీంనగర్‌క్రైం: నగరంలోని కిసాన్‌నగర్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌లోని బెతెస్త చర్చి సెక్రెటరీ ఆధ్వర్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా చర్చి సెక్రెటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


హుజూరాబాద్‌లో ఏటీఎం చోరీ

హుజూరాబాద్: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం నెట్‌వర్క్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌చారి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దుండగులు సుమారు రూ. 8,64,100 ఎత్తుకెళ్లారని, చోరీ ఆనవాళ్లు దొరక్కుండా ఉండేందుకు ఏటీఎంను ధ్వంసం చేసి తగులబెట్టారని ఫిర్యాదు పేర్కొన్నాడు. ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కరీంనగర్ నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.


ధ్వంసమైన ఏటీఎం మిషన్

గుర్తు తెలియని వ్యక్తి..

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు. దాదాపు 48 ఏళ్ల వయస్సు వ్యక్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాలుగు రోజుల క్రితం కిందపడిపోయాడని స్థానికులు తెలపడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహం ఆస్పత్రిలో ఉందని తెలిసిన వారు సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అరుదైన వ్యాధితో యువకుడు..

- రూ.15 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అరుదైన వ్యాధితో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల సాయికృష్ణ (23) లెప్టో స్పైరోసిస్ అనే వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు చేసి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ప్రాణాలు దక్కలేదు. మృతుడికి తండ్రి వెంకటేశం, తల్లి లలిత, చెల్లెలు అశ్విత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


సాయికృష్ణ (ఫైల్)

రామాలయం నిర్మాణానికి రూ.కోటి


అంతర్గాంలోని రామాలయం వద్ద పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్: రామాలయం నిర్మాణానికి రూ. కోటి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో నిర్మిస్తున్న రామాలయం పనులను సోమవారం పరిశీలించారు. గ్రామీణప్రాంత ప్రజల్లో దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, సురేశ్, శేఖర్‌రెడ్డి, గంగాధర్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి కృషి

రాయికల్: కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అన్నారు. రాయికల్ మండలం కుమ్మరిపల్లికి చెందిన బొప్పారపు భూమయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. మాజీ సర్పంచ్ గుమ్మడి భూమయ్య, నాగిరెడ్డి తిరుపతి, అంబల్ల అంజన్న, సత్తన్న,సూర జగన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న ఐజీ రంగనాథ్ దంపతులు


రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో బారులుతీరిన భక్తులు

కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని ఐజీ రంగనాథ్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు. రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.